క్లుప్తంగా

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురంటౌన్: స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, డీఎస్పీ బలివాడ నాగేశ్వర రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో దోమల నివారణమందు పిచికారీ



కాలువల్లో దోమలునివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్ దోమల నివారణమందు ద్రావణాన్ని శుక్రవారం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమల విజృంభణ వల్ల రాత్రి పూట నిద్రసమయంలో తట్టు కోలేకపోతున్నామని ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మండల అధికారుల సూచనల మేరకు కాలువల్లో పూడికలు తీయించి పారిశుద్ధ్య పనుల అనంతరం దోమల నివారణకు మందును పిచికారీ చేయించినట్లు తెలిపారు.

విద్యాలయాల్లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పెదంకలాంలో విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలు వేస్తున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: మండలంలోని పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న గ్రామాల్లో పిల్లలకు శుక్రవారం నాటికి 4,630 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు వైద్యాధికారులు శిరీష, రాధాకాంత్ తెలియజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రైవేట్ విద్యాలయాలు, బస్టాండ్‌ల వద్ద వైద్యారోగ్యశాఖ సిబ్బంది సహకారంతో ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులు వేశామని తెలిపారు.

విద్యార్థుల హాజరు పెంచాలి

భామిని: మండలం అత్తికొత్తూరు కాలనీ పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ జి.చంద్రరావు సందర్శించి రికార్డులు పరిశీలించారు. హాజరు పట్టీలో నమోదు కన్నా తక్కువ మంది విద్యార్థులు ఉండడంపై మండి పడ్డారు. స్కూల్‌కు వచ్చిన పిల్లలను బయటకు పంపవద్దన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

శత శాతం ప్రకృతి సాగుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎల్విన్‌పేట రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి సాగుకు ప్రాధాన్యతనిస్తూ గుమ్మలక్ష్మీపురం మండలాన్ని ఆదర్శ మండలంగా ఎంపిక చేయటం జరిగిందన్నారు. నూటికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ సాగుకు ఇక్కడి గిరిజన రైతులను మరింత ప్రోత్సాహించేలా సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్రసేవ పథకంలో భాగంగా మినీ ట్రాక్టర్లు కావాల్సిన రైతులు తమ సిబ్బందిని సంప్రదించి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీసీఎన్ఎఫ్ కో ఆర్డినేటర్ కె.భూషణరావు, ఎంఎంటి జి.నిర్మలాదేవి, సీఆర్పీ కె.దీప, ఎల్–1లు పి.ప్రసాద్, పరశురాం, వీఏఏ ఎం.దివ్య పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

• ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేటలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు పాదర్శకంగా, పార్టీలకు అతీతంగా అందుతున్నాయని దీనిని ప్రజలు గుర్తించి మేలు చేసే నాయకుడిని తిరిగి సీఎంగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరిగి అర్హులైనవారు పథకాలకు దూరంగా ఉంటే తెలుసుకుని వారిని ఎందుకు దూరంగా ఉంచుతున్నారని అధికారులను, సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తూ, దానిని సరిచేసేందుకు తగు సూచనలు ఇస్తూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుపై ప్రజలు సంతృప్తి చెందుతున్నారు. ప్రభుత్వం ఇస్తుంటే దానిని వక్రమార్గం పట్టించవద్దని సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని అందించాలనేది సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతోందని చెప్పారు. అర్హులైన వారికి సంక్షేమ పథకం అందలేదనే మాట వినిపించరాదని సీఎం జగన్‌మోహన్ రెడ్డి చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు దూరంగా ఉండేవని అది ఇప్పుడు జరగకూడదని తెలిపారు. సంక్షేమం అందించడమే కాకుండా పుర వీదులలో ప్రజల సమస్యలను గుర్తిస్తూ వాటిని అక్కడికి అక్కడే పరిష్కరించే దిశగా అడుగులు వేశారు. కార్యక్రమంలో బలిజిపేట సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బి.సత్యనారాయణమూర్తి, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, బలిజిపేట ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు విజయ, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఎం.సాంబమూర్తి, రామకృష్ణనాయుడు, జి.సత్యంనాయుడు, ప్రసాద్, రవణ, ఎ.పోలినాయుడు, తదితరులు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

14న సచివాలయ కన్వీనర్ల సమావేశం

ఈనెల 14వ తేదీన పార్వతీపురంలోని ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో నియోజకవర్గస్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నామని సమావేశానికి అందరూ తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి, ఐపాక్ సభ్యులు హాజరవుతారని తెలిపారు. సచివాలయ కన్వీనర్లతోపాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, నాయకులు హాజరవ్వాలని స్పష్టం చేశారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు వి.సాయిరాం, బి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములవుదాం

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: దేశభక్తి, ఐకమత్యంతో అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం అవుదామని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 'నా నేల–నా దేశం', 'నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిలో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం పోరాడిన త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి యువతతోనే సాధ్యమని, మాతృభూమి రుణం తీర్చుకునేందుకు దేశాభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఐకమత్యంతో అభివృద్ధి సాధిద్దామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమం ఆగస్టు నెలాఖరు వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణనాయుడు

వీరఘట్టం: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ఉభాలు మొదలుకొని, పంట కోత దశకు వచ్చేంత వరకు రైతులతో మమేకమవ్వాలని సూచించారు. ఈ ఏడాది 15 వేలకు పైబడి ఎకరాల్లో వరిసాగు లక్ష్యంగా చేసుకున్నామని వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య తెలిపారు. ఉభాల నుంచి కాలిబాటలు వేసుకోవాలని ఆమె తెలిపారు. సమావేశంలో జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ చైతన్యశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో సర్వే ద్వారా గుర్తించిన రోగులకు మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దేవస్థానం చైర్మన్ ప్రమాణ స్వీకారం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి దేవస్థానం చైర్మన్‌గా రావివలసకు చెందిన మర్రాపు సత్యనారాయణ శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈయన విశ్రాంత ఉపాధ్యాయులు. దేవస్థానానికి తొమ్మిదవ చైర్మన్‌గా నియమితులయ్యారు. చైర్మన్‌తో పాటు ట్రస్టీలుగా బోను వాగ్దేవి, మార్కొండ నారాయణ, నందివా కనక మహాలక్ష్మి, కె.సాగర్, బొడ్డేపు ఇందుమతి, గంట్యాడ సింహచలం నాయుడు, పల్ల పాపమ్మ, గౌరీశంకర పాత్రో, వీవీ అప్పలాచార్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకారానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ బిఎల్.నగేష్ తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

భామిని: మండలంలోని నులకజోడు సచివాలయం పరిధిలో విజృంభిస్తున్న దోమల నివారణకు శుక్రవారం ఫాగింగ్ చేశారు. ముందుగా ప్రభుత్వం అందించిన రెండు ఫ్యాగింగ్ మిషన్లు సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, కార్యదర్శి ఎం.మహేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రీన్ అంబాసిడర్స్‌తో వీధులు గుండా ఫాగింగ్ చేయించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



మక్కువలో ప్రతిజ్ఞ చేస్తున్న మావుడి సోదరులు, అధికారులు

• జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు

మక్కువ: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడు హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ నుంచి 20 వరకు నా భూమి – నా దేశం కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. అనంతరం అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. అలాగే నా దేశాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దేవకుమార్, ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై జనసైనికుల దాడి

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుడితి కృష్ణ, ఎం.ఆదినారాయణలపై అదే గ్రామానికి చెందిన జనసైనికులు బి.పోలినాయుడు, శంకరు రమేష్, గణేష్‌లు దాడి చేసిగాయపరిచారు. దీనిపై బాధితులు బలిజిపేట పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. బాధితులు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈఎల్ఆర్ వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో జనసైనికులు శుక్రవారం రాత్రి గ్రామంలోని నడివీధిలోకి వచ్చి ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని, నియోజకవర్గ ఎమ్మెల్యేను ఇష్టానుసారం దుర్భాషలాడుతున్నారు. వారిని ప్రశ్నించేందుకు వచ్చేవారిపై ఆ నలుగురు ఇష్టానుసారం విరుచుకుపడుతుండడంతో పరిస్థితులు అదుపుతప్పుతున్నాయని భావించి విద్యుత్ సమస్యపై అధికారులను ఫోన్‌లో సంప్రదించగా ఈఎల్ఆర్ అవడంతో పవర్ కట్ అయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వారికి చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా ఇక్కసారిగా నలుగురు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో బి.కృష్ణకు నుదుటిపై కర్ర దెబ్బ తగిలింది. ఎం.ఆదినారాయణను ముక్కుపై చేతితో గుద్దడంతో రక్తం కారింది. దీనిపై చర్యలు చేపట్టాలని బాధితులు కోరారు.



బలిజిపేట పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆ ఆరోపణలు నిరాధారం

• ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస : టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో చేసిన ఆరోపణలపై నాకు ఎటువంటి సంబంధం లేదని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. నిమ్మక తిరుపతిరావు అనే వ్యక్తి భూమిని తారుమారు చేసినట్లు చేసిన ఆరోపణలో నిజం లేదన్నారు. నాకు ఆ భూమికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం అర్జీ పెట్టుకున్నారని, ఆయన భూమి ఎక్కువగానే ఉందన్నారు. ఓ సేల్స్‌మేన్ ఇచ్చిన ఫిర్యాదులో కూడా నిజం లేదన్నారు. చేసిన రెండు ఆరోపణల్లో నిజం లేదన్నారు. కురుపాం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఎవరైనా సరే వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ తప్పదన్నారు. 2019 ఎన్నికలలో సాధించిన మెజార్టీ కన్నా ఎక్కువ సాధిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే మా ధైర్యం, నమ్మకం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు ఉన్నారు.

డీఎస్సీ 98 ఉపాధ్యాయులకు అభినందన సభ



ఎంఈఓలను సత్కరిస్తున్న 98 డీఎస్సీ ఉపాధ్యాయులు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 98 ద్వారా ఎంపికై మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఉత్తమమైన విద్యనందించడానికి కృషి చేయాలని ఎంఈఓ1,2 జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం డీఎస్సీ 98 ద్వారా మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో అభినందన సభనిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడానికి మన ఉపాధ్యాయులపై గురుతరమైన బాధ్యతను ప్రభుత్వం ఉంచిందన్నారు. అందుకనుగుణంగా మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం 98 డీఎస్సీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పూడి శంకరరావు, కార్యదర్శి దామోదరరావు, పెంట మోహనరావు, సిరికి మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ, మండలంలోని ఉపాధ్యాయులు ఎంఈఓలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అమరవీరులకు వందనం



నా భూమి నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుచ్చిమి సచివాల యం ప్రాంగణంలో సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నేలతల్లికి నమస్కరిస్తూ అమర వీరులకు వందనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ అన్నిగ్రామాల్లోని చెరువుల్లో అభివృద్ధి పనులను వివరించారు. అలాగే అమృత్ సరోవర్ చెరువులున్న ప్రాంతాల్లో నేల తల్లికి పూజలు నిర్వహించడమే కాకుండా దేశ సేవలో అమరులైన వీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం విద్యాలయాలున్న ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ కమిటీ కన్వీనర్లు గ్రామవలంటీర్లు, పీఓ భాను, కృష్ణ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరిట చంద్రబాబు అసత్య ప్రచారం

• పదవి లేకపోవడంతో చంద్రబాబు ఫ్రస్టేషన్‌లో ఉన్నారు...
• ఎమ్మెల్యే కళావతి



ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని కళ్లు ఉన్నా చూడలేని ధృతరాష్ట్రుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. వండవలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆమె శుక్రవారం మాట్లాడారు. ప్రాజెక్టులపై యుద్ధభేరి అంటూ చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వీరఘట్టం మండలంలో 24 సచివాలయాలు ఉండగా వాటిలో 220 మంది యువతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలు కల్పించగా వీరిలో వీరఘట్టం మండలానికి చెందిన వారు 120 మందికి పైగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. వీరఘట్టం మండలానికి చెందిన ఇంత మందికి పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందనే విషయం తెలియకుండా వీరఘట్టం యువతకు ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని గురువారం వీరఘట్టం వచ్చిన చంద్రబాబు అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు తదితర ప్రభుత్వ భవనాలను నిర్మిస్తూ పల్లె చెంతకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. 2017 సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి హోదాలో తెట్టంగి గ్రామానికి వచ్చిన చంద్రబాబునాయుడు ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని గాలికి వదిలేశారని ఎమ్మెల్యే కళావతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెట్టంగి గ్రామాన్ని సుమారు రూ.2.73 కోట్ల వ్యయంతో సచివాలయం, ఆర్‌బీకే, నాడు – నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి, సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఇలా అనేక అభివృద్ధి పనులు చేయించామని ఎమ్మెల్యే అన్నారు. మేము చేస్తున్న అభివృద్ధిని చూడలేక నిత్యం తప్పుడు ఆరోపణలు చేస్తున్న చంద్రబాబునాయుడును ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే కళావతి అన్నారు. రాష్ట్రంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడైనా ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేశారా అని ప్రశ్నించారు. అధికారం లేకపోవడంతో చంద్రబాబునాయుడు ఫ్రస్టేషన్‌తో ఇష్టానుసారంగా మాట్లాడుతూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే కళావతి అన్నారు.

సజావుగా ప్రజావేదిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: మండలంలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.17.11 కోట్ల వ్యయంతో చేపట్టిన 816 పనులపై గత 16 రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల ప్రకారం ప్రజావేదిక నిర్వహించారు. అయితే పలు గ్రామాల్లో వీఓఏలు, ఆశా వర్కర్లు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నట్టు బృందాలు గుర్తించాయి. ఇటువంటి తప్పిదాలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని ఫీల్డ్ అసిస్టెంట్లను ఏపీడీ జి.శ్రీహరిరావు హెచ్చరించారు. పలుచోట్ల జరిగిన ఉపాధి పనుల్లో తప్పుడు మస్టర్లు వేసినట్లు గుర్తించారు. రూ.87 వేల వరకు పేమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా చెల్లించినట్లు గుర్తించారు. అంతకు ముందు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ప్రజావేదికను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజావేదికలో జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, అసిస్టెంటు విజిలెన్స్ ఆఫీసర్ పి.సుదర్శన్, ఎస్ఆర్‌పీలు ఎం.తిరుపతిరావు, ఎం.గోవింద్, ఏపీవో జి.సత్యంనాయుడు, సోషల్ ఆడిట్ బృందాలు పాల్గొన్నాయి.